# పరిమళ

కాచుకుంటున్న పరిమళతో ''అబ్బాయి చాలా నెమ్మదస్తునిలాగానే వున్నాడు. నేను పని చెబితే 'మీ ఇంటి నౌకర్నా?' అంటాడేమోనని సందేహించాను... కానీ ఏ అవసరం పడ్డా చేసిపెడతానని అభియమిచ్చాడు కూడా'' అంది.

పరిమళ మనసులోనే చిన్నగా నవ్వుకుంది. మనసులోనే- 'ఆడదాని ఓర చూపుతో - జగాన ఓడిపోని ధీరుడెవ్వడోయ్?' అని పాడుకుంది.

నాగేశ్వర్ గదిలోకి అద్దెకు వచ్చిన మూడు రోజుల్నుంచీ తనను గమనిస్తున్నట్టు పరిమళ గ్రహించింది. నాగేశ్వర్‌ను తను గమనించనట్టు మసలుకుంది. అప్పుడే చనువిస్తే పర్యవసానం ఎంతవరకు వస్తుందోనన్న సందేహంతో నాగేశ్వర్ మీదకు వాలు చూపులు విసరడానికి తొందర పడలేదు. వాలుచూపులు, వాల్జడ విసరకుండానే తన ఒంపుసొంపుల చుట్టూ నాగేశ్వర్‌ను ప్రదక్షిణ చేయించాలనుకుంది. అలా తన చుట్టూ తిప్పుకుంటూ తనకు కావలసిన పనులను నాగేశ్వర్ చేత చేయించాలనుకుంది. ఇప్పుడు నాగేశ్వర్ కూరగాయలు తెచ్చివ్వడానికి సంతోషంగా ఒప్పుకున్నాడంటే తనను దారిలోకి తెచ్చుకుందుకే ఒప్పుకున్నాడని అనుకుంది పరిమళ.



ఉదయం ఎనిమిది గంటలు కావస్తుంది. ఆ ఊరినంతటినీ ఆవరించిన పొగమబ్బు ఇంకా పూర్తిగా విడిపోనేలేదు. చలి మాత్రం కొంచెం కొంచెం తగ్గుతూంది.

'బజారు కెళ్తున్నావా బాబూ?''

సుశీలమ్మ మాటకు నాగేశ్వర్ ఆగిపోయాడు. కానీ వెనుతిరిగి సుశీలమ్మ వంక చూడలేదు. సుశీలమ్మ తనునుద్దేశించే ఆ మాట అన్నదా? అన్న అనుమానం వచ్చిందతనికి. నాగేశ్వర్ సుశీలమ్మ ఇంటి ముందున్న గదిలో అద్దెకు చేరి కేవలం మూడు రోజులే కావస్తుంది. గది అద్దె విషయం మాట్లాడడం తప్ప సుశీలమ్మ తనతో ఎప్పుడూ ఏ మాటా మాట్లాడి ఎరుగదు.

నాగేశ్వర్ వెనక్కు తిరిగి సుశీలమ్మ వంక చూసాడు. పొగ మంచులో కాస్త దూరంగా సుశీలమ్మ నిలబడి వుండడం అగుపించింది. ఆమె చేతిలో కూరగాయల బేగ్ వున్నట్టు అస్పష్టంగా అగుపించింది. చుట్టూ ఎవరూ అగుపించకపోవడంతో సుశీలమ్మ తననుద్దేశించే అలా అడిగిందనుకుని ''అవునమ్మా! బజారుకే వెళ్తున్నాను'' అని అన్నాడు నాగేశ్వర్.

సుశీలమ్మ నాగేశ్వర్‌కు దగ్గరగా నడచి వచ్చి ''మరేమీ అనుకోకుంటే ఈ పూటకు అరకేజి వంకాయలు, పావుకేజి టమాటాలు కొని తీసుకురాగలవా?'' అని అంది. ఆమె మాటలో ప్రాధేయత మాత్రమే మిళితమై వుంది.

''ఆ మాత్రానికే అంత ఇదిగా అడగాలా అమ్మా! ఈ పూటకే కాదు... నేను మీ గదిలో వున్నంతవరకూ కూరగాయలు కొనుక్కొచ్చిస్తాను. మీరే మొహమాటపడి నాకు చెప్పడం మానకండి... కూరగాయలే కాదు... మీకు ఏ అవసరం వచ్చినా నేను తప్పక సహాయం చేయగలను'' అంటూ నాగేశ్వర్ సుశీలమ్మ చేతిలోని బేగ్‌ను అందుకున్నాడు. అలాగే సుశీలమ్మ అందించిన డబ్బును కూడా తీసుకుని బజారుకు వెళ్ళిపోయాడు.

సుశీలమ్మ తృప్తిగా నిట్టూర్చి- ఇంట్లోకి వెళ్ళిపోయింది. స్నానం కోసం వేడినీళ్ళను

నాగేశ్వర్ తనకు కావాల్సిన కూరగాయలతో పాటు, సుశీలమ్మ చెప్పిన కూరగాయలను కూడా కొనుక్కొచ్చాడు. అప్పటికి పొగమంచు పూర్తిగా విడిపోయింది. నాగేశ్వర్ సుశీలమ్మ ఇంటి ముందు నిలబడి ఇంట్లోకి చూశాడు. వరండాలో ఎదురుగా గోడకు ఓ ఫ్రేం వేలాడబడి వుంది. ఆ ఫ్రేం ఎంత కొత్తగా వుందో- ఆ ఫ్రేంకు వేలాడబడుతున్న గంధపుచెక్క చూరుతో తయారుచేయబడ్డ మాల అంతకంటే కొత్తగా వుంది. ఆ ఫ్రేం మీద జనన మరణ తేదీలు తాటికాయంత పరిమాణంలో రాయబడి వున్నాయి. మరణ తేదీని చూసాక ఆ ఫ్రేంలో వున్న వ్యక్తి చనిపోయి ఈ రోజుకు సరిగ్గా పదిహేను రోజులే అవుతుంది. సుశీలమ్మ విధవరాలు అని నాగేశ్వర్‌కు తెలుసు కానీ, వైధవ్యం పొంది ఎన్ని రోజులైందో ఇప్పుడే తెలిసింది.

''అమ్మా!'' పిలిచాడు నాగేశ్వర్. ఆ పిలుపుకు సుశీలమ్మ ఇంట్లోంచి

బయటికి వచ్చి- ''వచ్చావా బాబూ!'' అని నాగేశ్వర్ అందించిన బ్యాగును, ఛెల్లరను అందుకుని ''ఆ మహానుబావుడున్నంతవరకు మమ్మల్ని గడప దాటనివ్వలేదు. ఈ పదహైదు రోజులూ బంధువులే బజారుకెళ్ళేవారు. బంధువులంతా వెళ్ళిపోయారు...'' అంటూ అంటూ ఫ్రేంవైపు నుంచి దృష్టి మరల్చి మళ్ళీ నాగేశ్వర్ వంక చూసింది.

నాగేశ్వర్ మౌనంగా నిలబడ్డాడు. సుశీలమ్మే అంది మళ్ళీ ''కొత్తగా ఈ వయసులో బజారుకెళ్ళాలంటే నా కదోలా అనిపిస్తుంది. అమ్మాయిని పంపిద్దామంటే అది ఒట్టి అమాయకురాలు... దాని అమాయకత్వాన్ని చూసి ఏ కొట్టువాడైనా రెండర్థాల మాటలు గాట్లాడ్తారని భయం...'' నాగేశ్వర్ అర్థోక్తిలో అందుకుని ''నేను చెప్పాను కదమ్మా! నేను ఈ గదిలో వున్నంతవరకు మీరెవ్వరూ బజారుకు వెళ్ళే అవసరం కలగనివ్వననీ....'' అన్నాడు.

పరిమళ తలుపుచాటున నిలబడి నాగేశ్వర్ తననుచూడాలన్నట్టు ఒయ్యారాలు పోయింది. నాగేశ్వర్ పరిమళను చూసాడే కానీ పెద్దగా పట్టించుకోనట్టు వెనుతిరిగి వచ్చేసాడు. సుశీలమ్మ ఇంట్లోకి వెళ్ళబోతూ- అక్కడే వున్న పరిమళతో ''మన అదృష్టం కొద్దీ దొరికాడమ్మా'' అంది.

''నువ్వు సత్తెకాలపు మనిషివమ్మా! కాలం చాలా వేగంగా మారిపోతుంది. ఇది మీ కాలం కాదు. వాడు నన్ను మచ్చిక చేసుకునేందుకు ఇలా నెమ్మదస్తునిలా నాటకమాడుతున్నాడు. మన కుటుంబంతో స్నేహాన్ని పెంచుకుని నన్ను కాటెయ్యాలని చూస్తున్నాడు'' అంది పరిమళ. ఆ మాటకు సుశీలమ్మ ''... అలా అనుమానించడం తప్పమ్మా! ఆ బాబు నన్ను 'అమ్మా' అని పిలుస్తున్నాడు'' అంది- అంత మాత్రం అర్థం చేసుకొమ్మన్నట్టు.


పరిమళ పకపక నవ్వింది. ''ఇది సినిమా కథనో, నవల కథనో కాదమ్మా! నిన్ను 'అమ్మా' అని పిలవక 'అత్తయ్యా' అని పిలుస్తాడా మరి! ఒక అమ్మాయిని ప్రేమించాలనుకుంటే 'ప్రేయసీ' అని పిలుస్తారా ఎవరైనా ముందుగానే! అలాగే అమ్మాయి కూడా ప్రేమించాలనుకున్న వ్యక్తిని 'ప్రియుడా' అని అప్పటికప్పుడు పిలవదు కదా. ఇదే నవల్లోనో, సినిమాల్లోనో అవుతే నిన్ను 'ఏమండీ' అనో, రెండర్థాలు ధ్వనించే విధంగా 'ఆంటీ' అని పిలిచేట్టు కల్పిస్తారు. మన సంస్కృతి ప్రకారం వాడు నన్ను కూడా 'ఇదిగోమ్మా' 'రామ్మా', 'తీసుకోమ్మా' అనే పిలుస్తాడు. ముసుగులో గుద్దులాటలా 'ఇదిగోండి!' 'రండి' 'తీసుకోండి' అని మాత్రం అనడు చూడు. ఎలాగో ఓలాగా నమ్మించేట్టే పిలుస్తాడు. అయినా ఈ రోజుల్లో మనసులో దుర్బుద్ధి పెట్టుకునే 'చెల్లెమ్మా!, అక్కయ్యా!' అని పిలుస్తూనే నమ్మించి మోసం చేసే దుర్మార్గులున్నారు. మగాడిని మాత్రం ఎప్పుడూ నమ్మకూడదే అమ్మా! వాడి వాలకం చూస్తుంటే - పెళ్ళి చేసుకోవడానికి ప్రేమించేవాడిలా అనిపించడం లేదు. నమ్మించి మోసం చేసేవాడిలాగే వున్నాడు.... నువ్వు కూడా వాడిని ఓ కంట కనిపెట్టుకుని వుండమ్మా! ఎక్కువగా చనువివ్వద్దు. వాడిని చూస్తుంటే వయోబేధాన్ని కూడా పాటించనివాడిలాగే వున్నాడు'' అని అనర్గళంగా మాట్లాడేసింది.

''ఏ పుట్టలో ఏ పాముంటుందో ఎవరికెరుక? నీవు చెప్పింది కూడా నిజమే కావచ్చు. అతని విషయంలోనే కాదు ఏ మగాడి విషయంలోనైనా మన జాగ్రత్తలో మనం వుండడం మంచిదేకదా?'' అంటూ సుశీలమ్మ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రోజులు గడచిపోతున్నాయి.

ఒక రోజు - రాత్రి ఎనిమిది గంటలు కావస్తుంది. నాగేశ్వర్ తనగదిలో కూర్చుని ఏదో నవల చదువుతుండగా - సుశీలమ్మ ఆ గదిలోకి వచ్చింది. ఆమె చేతిలో గొడుగు వుంది.

''బాబూ! పరిమళసినిమాకు వెళ్ళింది. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. వాతావరణాన్ని చూస్తుంటే ఇప్పుడో అప్పుడో వర్షం కురిసేట్టు వుంది. సినిమా వదిలేసే టైం కూడా కావస్తుంది...'' సుశీలమ్మ విషయం పూర్తిగా చెప్పకముందే విషయం అర్థమైనట్టు సుశీలమ్మ చేతిలోని గొడుగును అందుకుని చొక్కా వేసుకుని బయలుదేరాడు నాగేశ్వర్. నాగేశ్వర్ గదిలోంచి బయలుదేరిన కొద్దిసేపటికే వర్షం కురవడం మొదలయ్యింది.




నాగేశ్వర్ 'నందిని' టాకీసుకు చేరుకోకముందే సినిమా వదిలిపెట్టారు. సినిమాకు వెళ్ళిన జనం కొందరు వర్షంలో తడుస్తూనే నడుస్తున్నారు. మరి కొందరు రోడ్డుకు ఇరువైపులా వున్న దుకాణాల ముందు నిలబడి వున్నారు. పరిమళ అలా నిలబడిన జనంలో వుందో, తడుస్తూ వెళ్తున్న జనంలో వుందో గుర్తుపట్టడం కష్టమైపోయింది నాగేశ్వర్‌కు.

''నాగూ!'' పిలిచింది పరిమళ. పరిమళ కొన్నిసార్లు కూడా నాగేశ్వర్‌ను 'నాగూ' అని సంబోధించింది గతంలో. నాగేశ్వర్ వీధిలో ఆగిపోయాడు. గొడుగును గుర్తుపట్టిన పరిమళ సుశీలమ్మ తనకోసమే నాగేశ్వర్‌ను పంపించిందని గ్రహించింది. నాగేశ్వర్ పరిమళను సమీపించాడు. పరిమళ గొడుగును అందుకుని గొడుగు క్రిందకు నాగేశ్వర్‌ను రానీకుండా ఇంటిదారి పట్టింది. ఆమె వీధిలో నడుస్తూ నాగేశ్వర్‌ను గురించే ఆలోచించడం మొదలుపెట్టింది. తనను వశం చేసుకోవాలనే తన వెంట కుక్కలా తిరుగుతున్నాడనుకుంది. పరిమళ ఏ పని చెప్పినా కాదనకుండగా చేసాడు. ఒకసారి తన కాలి చెప్పు తెగిపోతే బజారుకు వెళ్ళి కుట్టించుకురమ్మంటే ఏమీ సంశయించకుండగా కుట్టించుకొని వచ్చాడు. ఇప్పుడు వర్షంలో అరకొరగా తడుస్తూ గొడుగు క్రింద ఇద్దరమూ నడుస్తూ, వీలైనన్ని సార్లు తన శరీరాన్ని స్పర్శించి లేని కోరికలను రగిలించి నన్ను దారిలోకి తెచ్చుకుందామని ఉబలాటపడి వచ్చి వుంటాడు... దేభ్యం మొహం వాడూను' అనుకుని నాగేశ్వర్ కోసం వెనుదిరిగి చూసింది. ఆమెకు ఆరడుగుల దూరంలోనే బాడీగార్డులా వర్షానికి తడుస్తూ నడిచి వస్తుండడం అగుపించింది. ''ఈ మగవెధవలకు ఇదేం బుద్ధో' అనుకుని ఇంటికి చేరింది.

పరిమళ ఇంటికి చేరకముందే వర్షం తగ్గిపోయింది. పరిమళ రాక కోసం ఎదురుచూస్తున్న సుశీలమ్మ నాగేశ్వర్ పూర్తిగా తడిసిపోయి వస్తూండడం గమనించి పరిమళతో ఏమీ మాట్లాడకుండగా- నాగేశ్వర్ గదిలోకి వెళ్ళి ''అదేమిటి బాబూ! గొడుగు క్రింద ఇద్దరూ కలిసి రాలేకపోయారా?'' అని కంటితుడుపుగా అంది. నిజానికి అలా రావడం సుశీలమ్మకు గిట్టదు.

''ఇద్దరమూ అలా కలిసి వస్తుండడం చూస్తే లోకులు ఏమనుకుంటారు! ముఖ్యంగా ఇరుగుపొరుగువాళ్ళే అదిగో తోక అంటే ఇదిగో పడగ అంటారు'' అని నాగేశ్వర్ చొక్కాను వదిలి పిండుకోవడం మొదలుపెట్టాడు.

''వర్షంలో తడుస్తూ రాకపోతే వర్షం వెలిసే వరకు ఎక్కడైనా తలదాచుకోలేకపోయావా?'' అని అంది సుశీలమ్మ. ఆ మాత్రం సానుభూతి కనబరుస్తూ మాట్లాడకపోతే- తమకు కావల్సిన పనుల్ని నాగేశ్వర్ చేత చేయించుకోవడానికి ఇబ్బంది ఏర్పడుతుందనుకుందామె.

''రాత్రివేళ- అదీ వర్షంలో పరిమళను ఒంటరిగా వదిలి ఎలా వుండగలను?... వర్షంలో తడిస్తే నాకేమీ కాదులే... హైగా హాయిగా కూడా వుంటుంది'' అని చిన్నగా నవ్వాడు నాగేశ్వర్

## ఇంధన వనరులు

భారతదేశంలో ఇంధన సమస్య నిరంతరం గుబులు పుట్టిస్తూనే వుంటోంది. బొగ్గు, జల, అణు విద్యుత్ ఉత్పాదనలతో బాటు మరిన్ని నూతన ఇంధన ఉత్పత్తి అంశాలపై దృష్టి సారించడం జరుగుతూ వస్తోంది. అందులో భాగంగా సౌర శక్తి, బయోగ్యాస్, సముద్రపు అలలశక్తి, వాయుశక్తి... ఇత్యాది సంప్రదాయేతర వనరులపై ప్రయోగాలు జోరుగా సాగుతున్నాయి. సౌర శక్తి అంటే సూర్య కిరణాల ద్వారా వచ్చే ఉష్ణశక్తి. అంచనా ప్రకారం మన దేశంలో ఒక చదరపు కిలోమీటరు 5 నుంచి 7 కిలోవాటుల సౌరశక్తి లభించే అవకాశం వుంది. ఈ సౌరశక్తిని ఉపయోగించే సోలార్ వాటర్ హీటింగ్ సిస్టమ్, సోలార్ కుక్కర్లు నెలకొల్పుతున్నారు.



బయోగ్యాస్: పశువుల వ్యర్థ పదార్థాల నుంచి కార్బన్ డై ఆక్సైడ్ మిశ్రితమైన మిథైన్ గ్యాస్ వస్తుంది. దీనికి విపరీతంగాను, త్వరితంగాను మండే శక్తి వుండడంతో వంట చెరకు, కిరోసిన్, విద్యుత్ వంటివి ఎంతగానో ఆదుకోగల ఇంధన ప్రత్యామ్నాయంగా రూపుదిద్దుకుంటోంది.

సముద్రపు అలల నుంచి విద్యుత్ రాబట్టడం కొత్త ప్రక్రియ. సంప్రదాయేతర ఇంధన వనరులోల ఇది ముఖ్యమైనది.

సముద్ర తరంగాల నుండి విద్యుత్ ఉత్పాదన చేపట్టే కార్యక్రమం కోసం మన దేశంలో కేరళ రాష్ట్రంలోని 'విజింగమ్'లో కర్మాగారం నెలకొల్పారు. దీని గరిష్ట సామర్థ్యం 150 కిలోవాట్లు కాగా, 75 కిలోవాట్ల సగటు సామర్థ్యంతో ప్రస్తుతం పనిచేస్తోంది.

గాలి మరల ద్వారా అల్ప స్థాయిలో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే యూనిట్లు 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో విస్తారంగా వున్నాయి.

నాలుగు కిలోవాట్ల సామర్థ్యం గల బ్యాటరీ ఛార్జిల కోసం ఈ యూనిట్లు నెలకొల్పారు, గంటకు 18 కిలోమీటర్ల వేగంతో గాలి వీచే సమయంలో 15,000 మీటర్ల నీటిని పంపు చేయగల సామర్థ్యం కలిగిన గాలి మరలను బెంగుళూరులోని నేషనల్ ఏరోనాటికల్ లాబొరేటరీ నిర్మించింది.

— ఫణిమోహన్

మరికొన్ని రోజులు గడచిపోయాయి.

నాగేశ్వర్ ప్రవర్తనను గమనించిన పరిమళ- నాగేశ్వర్ దుర్మార్గుడు మాత్రం కాదనీ గ్రహించింది. పవిత్రంగా తనను పెళ్ళి చేసుకుని కాపురం చేసుకుని కాపురం చేయడం కోసం బుద్ధిమంతుడిలా మసలుకుంటున్నాడని అనుకుంది. అందుకు కూడా పరిమళ సుముఖంగా లేదు. నాగేశ్వర్‌ది దేబ్బెం మొహం కావడం వల్లనే ఆమె సుముఖంగా లేదని అనుకోవడానికి వీల్లేదు. నాగేశ్వర్ ప్రయివేట్ చిట్‌ఫండ్ కంపెనీలో నెలకు వెయ్యి రూపాయిలు మాత్రమే సంపాదించే ఉద్యోగి కావడం వల్ల ఆమె సుముఖంగా లేదు. ఆమె తండ్రిగారు బ్రతికుండగా తన పెళ్ళి కోసం యాభై వేలు జమచేసి పెట్టాడు. ఆ డబ్బుతో ప్రభుత్వ ఉద్యోగిని మాత్రమే కనుక్కోవాలని నిశ్చయించుకున్నదామె.

పరిమళ అనుకున్నట్టుగానే - ఓ సంబంధం దొరికింది. నాగేశ్వర్ ఊళ్ళో లేనప్పుడు నిశ్చితార్థం కూడా జరిగిపోయింది. పెళ్ళికి ముహూర్తం ఇంకా పదిరోజులు మాత్రమే మిగిలి వుంది.

''నాగేశ్వర్ మూడు రోజుల్లో తిరిగి వస్తానని వెళ్ళాడు. నాలుగు రోజులైనా తిరిగి రాలేదేమి?'' అంది సుశీలమ్మ పరిమళతో. పెళ్ళి ముహూర్తానికి అట్టే వ్యవధి లేకపోవడం వల్ల, పెళ్ళి పనులకు నాగేశ్వర్ మీదే ఎక్కువగా ఆధారపడింది సుశీలమ్మ.

''ఇక రాకపోవచ్చమ్మా! వచ్చినా నేను అతడి చేజారిపోయానన్న బాధతో మనకు ఎలాంటి సహాయం చేయకపోవచ్చు... మన గదిని ఖాళీ చేసి వెళ్ళినా వెళ్ళిపోవచ్చు'' అంది పరిమళ. ఆ మాటకు సుశీలమ్మ ఏమీ అనలేదు.

పరిమళ మాత్రం తనకు నిశ్చితార్థం జరిగిపోయిందని తెలిసాక నాగేశ్వర్ మొహం ఎలా పెడతాడో చూడాలని ఉవ్విళ్ళూరుతోంది.

అదేరోజు సాయంకాలం నాగేశ్వర్ ఊరి నుంచి తిరిగి వచ్చాడు. రాగానే పరిమళ తనకు నిశ్చితార్థం జరిగిన విషయం, అబ్బాయి ఉద్యోగం విషయం, ఊరు, పేరు, ముహూర్తం తేదీ గురించి చెప్పి- నాగేశ్వర్ మొహ కవళిక్కల కోసం అన్వేషించసాగింది.




నాగేశ్వర్ మొహంలో ఆమెకు సంతోషం మాత్రమే అగుపించింది. ''శుభం... నీకు పెళ్ళి కుదిరినందుకు చాలా సంతోషం...'' అని సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఆ తరువాత ''నాకూ ఒక అమ్మ, చెల్లి మాత్రమే వున్నారు... మిమ్మల్ని చూడగానే నాకు మా అమ్మ, చెల్లి గుర్తుకొచ్చేవారు.. మీకు సహాయపడుతుంటేనాకు మా అమ్మకు, చెల్లికిసహాయం చేస్తున్నట్టుగా అనుభూతి పొంది నా స్వంత ఇంటిలో వున్నట్టే అనుభూతి కలుగుతూంది. మీకు ఇలా సహాయపడుతుంటే- భగవంతుడు అక్కడ మా అమ్మకు, చెల్లెలికిసహాయం చేయడానికి ఎవరినైనా సృష్టిస్తాడని అనుకున్నాను...'' అన్నాడు నాగేశ్వర్.

పరిమళ మొహంలో పశ్చాత్తాపం కమ్ముకుంది. నాగేశ్వర్‌ను ఇన్నాళ్ళు అపార్థం చేసుకున్నందుకు ఆమె మనసు చిన్నబోయింది. తాను డిగ్రీ వరకు చదువుకుంది. నాగేశ్వర్ మనస్సును మాత్రం సరిగ్గా చదవలేకపోయినందుకు చాలా బాధపడింది.

ఎమ్మెస్ రాజ్